
సాక్షి ఒడిశా

శనివారం । 4 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,32,612లు, బంగారం 43.35 గ్రాములు, వెండి 100గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ముఠా ఆగడాలకు అడ్డుకట్ట -IIలో▸



పోలీసుల తీరు సరికాదు.. -IIలో▸

న్యూస్‌రీల్

రికార్డు స్థాయిలో రాగులు కొనుగోలు



ప్రభుత్వ మండీలో రాగులు విక్రయిస్తున్న గిరిజన మహిళ

కొరాపుట్: జిల్లాలో రికార్డు స్థాయిలో రాగులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ శుక్రవారం ప్రకటించారు. దీనిపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ ఏడాది జనవరి 25నుంచి ఇప్పటి వరకు 93,560 క్వింటళ్ల పంట కొనుగోలు చేశామన్నారు. ఒడిశా మిలిట్స్ మిషన్ పథకం కింద 2022–23 ఏడాదికి గాను కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 14 సమితులలో 49 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ద్వారా 16 ఏజెన్సీలు, 6676మంది రైతులు విక్రయాలు జరిపారని తెలిపారు. గతంలో దళారులకు రాగులు అమ్మకాలు చేయడంతో గిరిజనులు నష్టపోయేవారని గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రభుత్వమే నేరుగా మండీల్లో కొనుగోలు చేయడంతో ఈ విజయం సాధ్యమైందని వివరించారు.

పర్లాకిమిడి ఐఐసీగా బబులీ నాయక్



ఐఐసీ బబులీ నాయక్

పర్లాకిమిడి: స్థానిక ఆదర్శ పోలీస్ స్టేషన్ నూతన ఐఐసీగా బబులీ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గంజాం జిల్లా గొలంతర నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఐఐసీ వివేకానంద బెహరా బరంపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఐఐసీ మాట్లాడుతూ.. పట్టణంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, దొంగతనాలను అరికట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఒకే ఈతలో మూడు దూడలు జననం



జన్మించిన దూడలతో యజమాని పండా

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంభారిసాహి గ్రామంలో బాలకృష్ణ పండాకు చెందిన ఆవు ఒకే ఈతలో 3 దూడలకు జన్మనిచ్చింది. అన్నీ కూడా ఆరోగ్యంగా ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ వైద్యులు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆవు ప్రసవ వేదన పడుతుండటంతో యజమాని వెంటనే వెటర్నరీ వైద్యునికి సమాచారం అందించారు. ఎల్ఐ బేగమ్, అటెండెంట్ మహేశ్వర నాయక్, శ్రీధర గౌఢ వచ్చేసరికి ఆవు ఒక దూడను ప్రసవించింది. పరిస్థితిని గమనించిన సిబ్బంది.. మరో దూడ ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సపర్యలు చేయగా మరో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒక ఈతలో 3దూడలు జన్మనివ్వడం చాలా అరుదని వైద్యులు తెలిపారు.

రబి నందోకు ఘన స్వాగతం



విమానాశ్రయంలో రబి నందోకు స్వాగతం పలుకుతున్న బీజేడీ నాయకులు

జయపురం: ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీమంత్రి, బీజేడీ నాయకులు రబినారాయణ నందో.. ఇటీవల విశాఖపట్నంలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌లో కొద్ది రోజులు విశ్రాంతి తీసుకున్న ఆయన.. పూర్తి ఆరోగ్యవంతునిగా కోలుకుని, శుక్రవారం ఉదయం జయపురానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక విమానాశ్రయం వద్ద బీజేడీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీతో అతని నివాసం వరకు కొనసాగారు.

అమ్మకు వందనం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభం
- ఈ ఏడాది తల్లులకు అంకితం: సీఎం నవీన్
- సృజనాత్మకత, సాంకేతికతతో లింగ అసమానతలకు అడ్డుకట్ట
- మహిళల విజయ గాథల సంచిక ఆవిష్కరణ



మహిళలకు ఉత్తమ సాధికారిత పురస్కారం అందిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర మహిళ–శిశు అభివృద్ధి శాఖ శుక్రవారం లోక్‌సేవా భవన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఎం నవీన్ పట్నాయక్.. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జీవితంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవడానికి పోరాడుతున్న కోట్లాది మంది తల్లులకు అంకితం చేశారు. మహిళ–శిశు అభివృద్ధి శాఖ రూపొందించిన యువ మస్కట్ 'కున్ని', రాష్ట్రప్రభుత్వ కొత్త బాలల విధానం 'ప్రారంభ్'ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు తమ సొంత ప్రతిభ, నైపుణ్యంతో సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారన్నారు. ప్రస్తుతం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ప్రయాణం ప్రారంభించారని అభినందించారు. 70లక్షల మంది మహిళలతో కూడిన భారీ సంస్థ స్వయం సహాయక బృందం(ఎస్‌హెచ్‌జీ) నుంచి లఘు–సూక్ష్మ వ్యాపార సంస్థగా(ఎస్ఎంఈ) రూపాంతరం చెందుతుందన్నారు. ఈ పరివర్తన కుటుంబానికి కుమార్తెలు భారం కాదని రాష్ట్ర మహిళలు నిరూపించారని ప్రశంసించారు.

హక్కుల పరిరక్షణే లక్ష్యం

సృజనాత్మకత, సాంకేతికత ద్వారా లింగ సమానత్వాన్ని సాధించడం ఈ ఏడాది మహిళా దినోత్సవం నినాదంగా సీఎం నవీన్ ప్రకటించారు. సమాజంలో లింగ వివక్ష నివారణకు సాంకేతికత ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. మహిళల హక్కుల పరిరక్షణతో పాటు ఆవిష్కరణలు, సాంకేతికత ప్రయోగంతో విద్య, ఉపాధి, కర్మ క్షేత్రాలు, సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. లింగ సమానత్వంతో స్త్రీలపై హింస, వివక్ష నివారణ సాధ్యమని ప్రేరేపించారు. తద్వారా సమ సమాజం ఏర్పాటు సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాలల వృద్ధికి ప్రాధాన్యం..

ఆశీర్వాద్ యోజన ఐఎంఎస్ పోర్టల్, వన్‌స్టాప్ సెంటర్, ఉమెన్స్ హెల్ప్‌లైన్‌లో మహిళల విజయగాథలపై బుక్‌లెట్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ముగ్గురు ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉత్తమ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, ఉత్తమ జిల్లా శిశు సంరక్షణ అధికారికి ఆయన అవార్డులు ప్రదానం చేశారు. కొత్త బాలల విధానం విద్యాభ్యాసంపై దృష్టిని కేంద్రీకరించి, వారి మనుగడకు ఆధారమైన హక్కుల పరిరక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధిని సాధించడానికి ప్రాధాన్యత కల్పిస్తుందని వివరించారు. బాలల శ్రేయస్సు గణనీయంగా మెరుగు పరచడంతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో రాష్ట్ర నిబద్ధతను బలోపేతం చేయడం కొత్త బాలల విధానమే లక్ష్యంగా పేర్కొన్నారు.



వేదికపై యువ మస్కట్ కున్ని ఆవిష్కరణలో సీఎం నవీన, అధికారులు



కార్యక్రమానికి హాజరైన మహిళా స్వయం సహాయక బృందాల ప్రతినిధులు



ఆశీర్వాద్ యోజన సంచికను ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

కోవిడ్‌లో సైతం ఉపాధి..

భువనేశ్వర్‌కు చెందిన విజయలక్ష్మి స్వయం సహాయక సంఘానికి చెందిన జానకి పశాల్ తన అనుభవాలను వివరిస్తూ ముఖ్యమంత్రి మహిళా సాధికారత కార్యక్రమం వివిధ రంగాల్లో స్వతంత్రంగా పని చేసేందుకు వీలు కల్పించిందని కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్–19 సంక్రమణ విపత్కర పరిస్థితుల్లో జీవనోపాధి కోసం మాస్కులు, జాతీయ పతాకాల తయారీలో నైపుణ్యత చాటుకున్న విజయలక్ష్మి బృందం వర్తమాన పరిస్థితుల్లో వెనుదిరిగేది లేదని ప్రగాఢ ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్–అడిషనల్ చీఫ్ సెక్రటరీ అనూ గర్గ్ తదితర ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కొరాపుట్‌లో స్వల్ప భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదు



భూకంపం తీవ్రత నమోదు చిత్రం

కొరాపుట్: జిల్లాలో శ్రకవారం ఉదయం 5 గంటలకు 2సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. లక్ష్మీపూర్, నారాయణపట్న సమితులలో ఈ ప్రభావం కనిపించింది. అప్పటికి చాలామంది నిద్రలో ఉండటంతో అంతగా గుర్తించలేదు. కొందరు తాము భూమి కంపించిన అనుభూతి పొందామని పేర్కొన్నారు. ఇది రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదైంది. ప్రభావిత ప్రాంతానికి 129 కిలోమీటర్ల దూరంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్ పట్టణం ఈ భూకంపానికి కేంద్రంగా గుర్తించారు. దీని ప్రభావంతో నారాయణపట్న సమితి కేంద్రంలోని హరిజన వీధిలో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలి పోయిందని స్థానికులు తెలిపారు. అలాగే కొరాపుట్ జిల్లా ఏడీఎం రాజేంద్ర మాఝి మీడియాతో మాట్లాడారు. భూకంపం విషయం వాస్తవమేనని, అయితే జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం లేదని ప్రకటించారు. ఆస్తినష్టంపై ఇంకా సమాచారం లేదన్నారు.



నారాయణపట్నలో కూలిన ఇంటి గోడ

జిల్లాలో భూ ప్రకంపనలు

రాయగడ: జిల్లాలోని టికిరి, కాసీపూర్, రాయగడ, జిమిడిపేట, కల్యాణ సింగుపూర్ ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. తెల్లవారుజాము 5గంటల ప్రాంతంలో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఇళ్లలోని వారు భయాందోళనకు బయటకు పరుగులు తీశారు. టికిరిలో 3.4, రాయగడలో 3.8, కల్యాణ సింగుపూర్‌లో 2.3, జిమిడిపేటలో 1.5 తీవ్రత నమోదైనట్లు సమాచారం.

మరో వారంలో సీసీ కెమెరాలు సిద్ధం



పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై కెమెరాల పనితీరు

రాయగడ: మరో వారం రోజుల్లో స్థానిక పట్టణంలోని సీసీ కెమెరాలు అందుబాటు లోకి రానున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న దొంగతనాలు, దోపిడీల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం, పౌరసంస్థ సంయుక్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి కొద్ది నెలల క్రితం సర్వే చేపట్టారు. ఈ క్రమంలో పట్టణంలోని 32 ప్రధాన కూడళ్లలో 120సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు నిర్ధారించారు. దీంతో ప్రారంభమైన అమరిక పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పట్టణంలో 52 కెమెరాల ఏర్పాటు పూర్తి కాగా.. మరో 68ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 5 హైపవర్ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీటి నిర్వహన వ్యవస్థ స్థానిక పోలీస్ స్టేషన్ లోని పై అంతస్తులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఎల్‌సీడీ ఏర్పాటు వ్యవస్థ కూడా సిద్ధమైంది. నిత్యం పరివేక్షణలో ఇద్దరు పోలీస్ సిబ్బంది ఉండేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం పనితీరును పరిశీలిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ త్వరలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల అమరిక పూర్తయితే కొంతమేర అసాంఘిక కార్యకలాపాలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.

సాయం కోరితే.. కొట్టేశారు!

- మహిళ నుంచి ప్రభుత్వ సాయాన్ని కాజేసిన కేటుగాళ్లు
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

జయపురం: ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన ఆర్థిక సాయాన్ని కేటుగాళ్లు కాజేశారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను బొయిపరిగుడ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. దీనిపై బొయిపరిగుడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022 ఆగస్టు 17న హల్దికుండ్ గ్రామానికి చెందిన సేలుమ్ దురువ, త్రిలోచనన ధురవ గుప్తేశ్వర్ సమీపంలో అటవీ ఉత్పత్తుల సేకరించేందుకు వెళ్లారు. సాయంత్రం జోరుగా వర్షం కురవడంతో రాత్రంతా కొండ గుహలోనే తల దాచుకున్నారు. అయితే భారీ వర్షానికి దురదృష్టావశాతు కొండ చరియలు విరిగి పడటంతో ఇరువురూ మృతిచెందారు. ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున విపత్తు నిధి నుంచి ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని రామగిరి లోని ఉత్కళ గ్రామీణ బ్యాంక్ ఖాతాలో జమ కాగా, జనవరి 31న సేలుమ్ దురువ భార్య ఇచ్ఛావతి రూ.10 వేలు డ్రా చేసింది. ఫిబ్రవరి 27న మరోసారి బ్యాంక్‌కు వెళ్లగా, ఖాతాలో డబ్బు లేకపోవడంతో ఖంగుతింది. వెంటనే బొయిపరిగుడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆమె బ్యాంక్ ఖాతా నుంచి జనవరి 31న నగదు డ్రా చేసిన రోజే హల్దికుండ్ పంచాయతీ సమితి సభ్యుడు విభీషన్ హంతాల్ ఖాతాకు రూ.లక్షా 50 వేలు బదిలీ అయినట్లు గుర్తించారు. అలాగే ఫిబ్రవరి 2న మరో రూ.10 వేలు తీయగా, అదేరోజు నీలాంబర ధురువ ఖాతాకు రూ.లక్ష, నఖుల్ ధురువ ఖాతాకు మరో రూ.లక్ష బదిలీ అయ్యాయి. ఇచ్ఛావతికి చదువు రాకపోవడంతో బ్యాంకులో డబ్బులు తీసే సమయంలో తెలిసిన వారి సాయం తీసుకుంది. ఆమె అమాయకత్వాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న నిందితులు.. ఆమె ఖాతా నుంచి తమ ఖాతాలకు డబ్బు బదిలీ చేసుకున్నారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో విభీషణ్ దురువ, నీలాంబర దురువ, నఖుల్ దురువ లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు ఇచ్ఛావతి

చైతన్య రథం ప్రారంభం



జెండా ఊపి చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్

మల్కన్‌గిరి: విటమిన్ బియ్యం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద చైతన్య రథాన్ని కలెక్టర్ విశాల్‌సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేయనున్న ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ తో పాటు ఎన్నో పోషకాలు ఉంటాయని తెలిపారు. దీని వల్ల పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య రథం జిల్లాలోని అన్ని సమితులలో ప్రచారం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆహార కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ మోన జెత్వా, అధికారులు పాల్గొన్నారు.

గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

- రూ.కోటికి పైగా ఆస్తినష్టం

భువనేశ్వర్: ఖుర్దా రిజర్వ్ ఫారెస్ట్‌కు సమీపంలోని పాత సామగ్రి గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మానవ అకృత్యంతో రానున్న వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగించే పరిస్థితులను ప్రేరేపించనున్నట్లు ఈ సంఘటన అద్దం పడుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుర్దా జిల్లా బరుణై రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని స్క్రాప్ గోడౌన్‌లో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. అందులోని బ్యాగులు, డబ్బాలు, టైర్లు, ట్యూబ్ లతో పాటు ఉపయోగించిన ప్లాస్టిక్ పదార్థాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా విస్తరించి ప్రమాదకర పరిస్థితి అలముకుంది. ఈ ప్రాంతంలో నల్లటి పొగలు దట్టంగా కమ్మడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బరుణైకొండ దక్షిణం వైపు పొగలు కమ్ముకున్నాయి. అందులోని కార్మికులు భయంతో పరుగులు తీస్తున్నట్లు గుర్తించినట్లు స్థానికులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. సుమారు 30మంది కార్మికులు బయటకు వచ్చి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సమాచారం అందడంతో ఖుర్దా, సమీప ప్రాంతాల నుంచి అగ్నిమాపక దళాలను ఘటనా స్థలానికి తరలించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు 6అగ్నిమాపక యంత్రాలు, 22మంది సిబ్బంది కొన్ని గంటలసేపు నిరవధికంగా శ్రమించారు. సకాలంలో స్పందించడంతో రిజర్వ్ ఫారెస్ట్‌లో మంటల వ్యాప్తిని నివారించారు. అగ్నిప్రమాదంలో రూ.కోటికి పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. అయితే అగ్ని ప్రమాదానికి ఖచ్చితమైన కారణం నిర్ధారించలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బ్లడ్ బ్యాంక్ తెరవాలని వినతి

జయపురం: స్థానిక సబ్ డివిజన్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకును వెంటనే తెరిచి, పూల్‌బెడ లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించాలని జయపురం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పవన్‌కుమార్ పాణిగ్రహి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను శుక్రవారం కలిసి, వినతిపత్రం అందించారు. జయపురంలో ఉన్న సబ్ డివిజన్ ఆస్పత్రికి కేంద్రాస్పత్రికి అప్‌గ్రేడ్ చేశారని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా 2018 అక్టోబర్‌లో పూల్‌బెడ ప్రాంతంలో నూతన భవనాలు నిర్మించారని, అయితే బ్లడ్‌బ్యాంక్ మాత్రం పాత భవనాల్లోనే కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు దీనిపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రశ్మీకాంత రథ్, సాధారణ కార్యదర్శి సురేష్‌కుమార్ నాయుడు, సహాయ కార్యదర్శి పద్మనాభ హొత్తా, తరుణకుమార్ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న పాణిగ్రహి తదితరులు

బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా జగబంధు దాస్

పర్లాకిమిడి: అధికార పార్టీ బీజేడీ గజపతి జిల్లా నూతన అధ్యక్షుడిగా జగబంధు దాస్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత నాలుగేళ్లుగా ఆర్.ఉదయగిరి సమితి బీజేడీ అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణుల హర్షం వ్యక్తంచేశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం పర్లాకిమిడి చేరుకున్న దాస్‌ను పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, సాధారణ కార్యదర్శి లక్ష్మీకాంత పారిచ్చా, జమాదార్ పట్నాయక్, కాశీనగర్ ఎన్ఏసీ అధ్యక్షుడు రఘురాం సాహు, యువ జన మోర్చా జిల్లా అధ్యక్షుడు శాసనం లింగరాజు, ఛత్ర బీజేడీ నాయకులు బ్రజకిషోర్ త్రిపాఠి తదితరులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని మోహనా, పర్లాకిమిడి నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు.



జగబంధు దాస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రఘురాం, ప్రదీప్ నాయక్, లింగరాజు

నూతన కార్యవర్గం..

బీజేడీ పర్లాకిమిడి పట్టణ అధ్యక్షుడిగా సుధీర్ రంజన్ మహాపాత్రొ, కాశీనగర్ ఎన్ఏసీ అధ్యక్షుడిగా రొక్కం చలపతిరావు, మోహనాకు రంజీబ్ శబర, ఆర్.ఉదయగిరికి భీమా పైకో, గుసాని సమితికి చెల్లి ఈశ్వరరావు, నువాగడకు జోహన్ మాఝి ఎంపికయ్యారు. బీజేడీ సాధారణ కార్యదర్శులుగా రొక్కం రాంప్రసాద్(కాశీనగర్), పంటల ప్రసాదరావు, జమీదార్ పట్నాయక్, సుమంత్ చింతాడ, ఎస్.భాస్కరరావు, యుధిష్టర్ బోడముండి, రాజేంద్రకుమార్ రణసింగి, హదియా కంధ, సోమనాథ్ బలియార్ సింగ్, ఉపాధ్యక్షులుగా అంతర్యామి గమాంగో, రొక్కం సతీష్, ఎస్.గజపతిరావు, యరగాన రామచంద్రరావు, ఆర్.విజయకుమార్, దండాసి సాహు (మోహనా), సుధాం శేఖర్, జేమ్స్ రైకా, నిరో భుయ్యాన్, లజర్ మాఝి నియమితులయ్యారు.

క్లుప్తంగా

స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన కలెక్టర్



స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్ కమలోచన్ మిశ్రా

కొరాపుట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను నవరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు స్ట్రాంగ్ రూం గోదాంకు వెళ్లి, భద్రతా ఏర్పాట్లు, గదుల పటిష్టత, ప్రహరీ సామర్థ్యాన్ని తనిఖీ చేశారు. ఈవీఎంలు ఉన్న గదుల సీల్‌ను పునః పరిశీలించారు. పరిశీలనలో ఏడీఎం భాస్కర్ రైతా, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పది ఎకరాల్లో జీడి తోట దగ్ధం



కాలిపోతున్న జీడితోటలు

కురుపాం: కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని హుకుంపేట గిరిజన గ్రామానికి చెందిన సోములు, సూరమ్మ, ఆర్.తాతబాబు, త్రినాథ్, పార్వతమ్మలకు చెందిన సుమారు పది ఎకరాల జీడి తోట శుక్రవారం దగ్ధమైంది. మరో నెల రోజుల్లో చేతికి అందనున్న పంట అగ్నికి ఆహుతైందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

13న 50 వాహనాలకు పోలీస్ శాఖ వేలం



గుమడలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలం చెల్లిన 50 వాహనాలను ఈ నెల 13న ఈ వేలం వేయనున్నట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ వినియోగించిన 50 వాహనాలను ఏడు లాట్లుగా విభజించామని, వాహనాల వేలం ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బిడ్డర్లు వెబ్‌సైట్‌ను సంప్రదించి, బిడ్డింగ్ వేయాలని పిలుపునిచ్చారు. వేలం వేయాల్సిన 50 పోలీసు వాహనాలు ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్నాయని, ఆసక్తి కలిగిన వేలందారులు ఎంటీఓ ఎల్.శ్రీనివాసరావు ఫోన్ నంబర్ 9121109486, మెకానిక్ ఫోన్ నంబర్ 9440070857లను సంప్రదించి వాహనాలను పరిశీలించుకోవచ్చునని ఎస్పీ సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామం చందక వీధిలో గ్రామస్తుడు వడ్డీ చంద్ర ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్ బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం దా డులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడుల్లో 2170 కిలోల బియ్యం పట్టుబడ్డాయని, బియ్యం విలువ రూ.82,460 ఉంటుందని తెలిపారు. పీడీఎస్ బియ్యం ల బ్ధిదారుల నుంచి సేకరించి అక్రమంగా నిల్వ ఉంచిన వడ్డీ చంద్రపై కేసు నమోదు చేసి పౌరసరాఫరాల శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు.

భర్త ఆచూకీ తెలపాలంటూ భార్య ఫిర్యాదు



కోల మోహన కృష్ణ

జియ్యమ్మవలస: తన భర్త ఆచూకీ తెలపాలంటూ మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన కోల తులసి రాణి శుక్రవారం జియ్యమ్మవలస,పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్సై కళాధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినమేరంగి గ్రామానికి చెందిన తులసిరాణికి 2009వ సంవత్సరంలో శ్రీకాకుళంలోని కొన్నవీధికి చెందిన కోల మోహన కృష్ణతో పెళ్లి అయింది. ప్రస్తుతం వారు పార్వతీపురం మైదానం వీధిలో కర్రీ పాయింట్ నడుపుతున్నారు. దగ్గర బంధువు పెళ్లికి బుధవారం భర్తతో కలిసి చినమేరంగి గ్రామానికి ఆమె వచ్చింది. తన భర్తకు గతంలో ఫిట్స్ వచ్చాయని, బంధువులను దిగబెట్టి వస్తానని చెప్పి సాయంత్రం వెళ్లి ఇంతవరకు రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఆచూకీ తెలిసిన వారు ఫోన్‌నంబర్ 912109478కు తెలియపరచాలని ఎస్సై కోరారు.

ముఠా ఆగడాలకు అడ్డుకట్ట

- వివిధ ఘటనల్లో ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు తెరదీస్తున్న ముఠా ఆగడాలను పోలీసులు అడ్డుకట్ట వేశారు. దీనికి సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఆలయాల్లో విలువైన విగ్రహాలను చోరీ చేస్తున్న దుండగులను జాజ్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 31 విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో అరవింద్ కుమార్ సింగ్(43), బాబర్ అలియాస్ జావేద్(40), విజయ్ శుక్లా అలియాస్ పండిట్(45), శశిధర్ నాయక్(49) ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కాగా, మరొకరు బాలాసోర్ జిల్లా నీలగిరి ప్రాంతానికి చెందిన వారిగా తెలిపారు. నిందితుల నుంచి తుపాకులు, మందుగుండు సామగ్రి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సూత్రధారి ఇంకా పరారీలో ఉండగా, గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

దొరికిన ధాన్యం దొంగ..

జయపురం: సబ్ డివిజన్ పరిధి హటపాదర్‌లోని ధాన్యం మిల్లులో 100బస్తాల ధాన్యం దొంగిలించిన నిందితుడిని జయపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పట్టణ పోలీసు అధికారి సంబిత్‌కుమార్ బెహరా వెల్లడించారు. హటపాదర్‌కు చెందిన సుమిత్ ఖొరా(27) ఫిబ్రవరి 27న అదే గ్రామంలోని మిల్లులో ధాన్యం బస్తాలు అపహరించారు. అయితే నిర్వాహకుడు ఎ.పవన్‌కుమార్ లెక్కలు చూడగా స్టాక్‌లో 50కిలోల ధాన్యం 100 బస్తాలు తక్కువ ఉన్నట్లు గమనించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా మిల్లు నుంచి వాహనం ద్వారా బయటకు తరలించినట్లు గుర్తించి, అదే నెల 28న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడంతో పాటు నిందితుడు సుమిత్ ఖొరాను అదుపులోకి తీసుకొని విచారించారు. ధాన్యంలో 35 బస్తాలను సియాడిమాల గ్రామంలో ఓ వ్యక్తికి, బ్రాహ్మణిపుట్ గ్రామంలో ఇద్దరు వ్యక్తులకు 30, 35 బస్తాలు చొప్పున విక్రయించినట్లు అంగీకరించాడు. ఈ మేరకు చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచిన అనంతరం జైలుకు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

గంజాయి స్వాధీనం..

రాయగడ: కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పద్మపూర్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన గులాం ఖాన్(25), రాజ్ బహదూర్(24) ఉన్నారు. పద్మపూర్ సమితి ఇంద్రపూర్ పంచాయతీ లోని రవుతురంగ నుంచి ఉత్తరప్రదేశ్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు జులుముండ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రవుతురంగ ప్రాంతం నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా, ఇందులో 30కిలోల గంజాయి లభించినట్లు ఐఐసీ రమేష్ బలియార్ సింగ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను శుక్రవారం ఉదయం గుణుపూర్ కోర్టులో హాజరు పరిచారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు(వెనుక ముసుగులో)



అరెస్టు చేయబడిన నిందితునితో పాటు రెండు వాహనాలతో ధాన్యం బస్తాలు

పర్లాకిమిడిలో డోలోత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

పర్లాకిమిడి: పట్టణంలోని డోలా ట్యాంకు వద్ద డోలా ఉత్సవాలు శుక్రవారం ఆడంబరంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పెద్ద రాధాకాంత మఠం శ్రీరామస్వామి మందిరం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి, డోలా ట్యాంకు వద్ద నిలిపారు. యువరాణి కల్యాణీదేవి గజపతి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదికపై శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో నృత్యాలు చేసి, ప్రేక్షకులను అలరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, మహంత రాధాకాంత దాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజగురు, బినోద్ జెన్నా పాల్గొని, మాట్లాడారు. బిచిత్రానంద బెబర్తా ముఖ్య వక్తగా వ్యవహరించారు. హోలీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



పల్లకిలో ఊరేగుతున్న రాధాకృష్ణులు

పోలీసుల తీరు సరికాదు..

- యువమోర్చా నాయకుల అరెస్ట్‌పై బీజేపీ నాయకుల మండిపాటు



పర్లాకిమిడి: ఆదర్శ పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ముట్టడి పురస్కరించుకుని నిరసన ప్రదర్శించిన సందర్భంలో బీజేపీ యువమోర్చా కార్యకర్తల పట్ల పోలీసులు అతిగా ప్రవర్తించారని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో డీజీపీ, కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్, భువనేశ్వర్ డీసీపీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఫిర్యాదు దాఖలు చేశారు. బీజేపీ రాష్ట్రశాఖ ఈ ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 28న స్థానిక మహాత్మాగాంధీ మార్గ్ దిగువ పీఎంజీ ప్రాంతంలో పోలీసులు, బీజేపీ యువజన మోర్చా కార్యకర్తల మధ్య ఘర్షణ ఉద్రిక్తత రేపిన విషయం తెలిసిందే. ఈ మేరకు కార్యకర్తల పట్ల పోలీసుల అతి ప్రవర్తనకు నిరసనగా బీజేపీ నాయకత్వం ఆందోళనకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని ఎస్పీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా జిల్లా ఎస్పీ కార్యాలయాల ఎదుట శనివారం నిరసన ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలు, మంత్రి నవకిషోర్ దాస్ హత్య కేసుపై సీబీఐ విచారణ డిమాండ్‌తో బీజేపీ యువమోర్చా నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఉద్దేశపూర్వకంగా కార్యకర్తలపై అమానుషంగా దాడి చేశారని, దీనిపై డీజీపీ, సీపీ, డీసీపీ బాధ్యత వహించాలని బీజేపీ నాయకుడు జగన్నాథ్ ప్రధాన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై రాజధాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసినప్పటికీ, పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. ఈ చర్య సీఆర్‌పీసీ సెక్షన్ 154 ఉల్లంఘనగా పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేపట్టిన బీజేపీ యువమోర్చా కార్యకర్తలపై ఐపీసీ సెక్షన్ 307కింద హత్యాయత్నం ఆరోపణతో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ హరిచందన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కోర్టుకు వెళ్తాం..

పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులను అంగీకరించకపోతే, కోర్టును ఆశ్రయించడం తప్పదని బీజేపీ నాయకులు హెచ్చరించారు. మహాత్మాగాంధీ మార్గ్ నిరసన ర్యాలీలో పలువురు బీజేపీ యువమోర్చా సభ్యులతో పోలీసులు ఘర్షణకు దిగి, హింసాత్మకంగా వ్యవహరించిన వీడియో దృశ్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

యువమోర్చా నిరసన

పర్లాకిమిడి: రాష్ట్ర రాజధానిలోని మాస్టర్ క్యాంటిన్ వద్ద పోలీసుల దాడిలో పలువురు బీజేపీ నాయకులు గాయాల పాలయ్యారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని గజపతి జిల్లా యువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్ వద్ద నిరసన చేపట్టి, ఐఐసీ బబులీ నాయక్‌కు వినతిపత్రం అందించారు. యువజన మోర్చా అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రొ, సాధారణ కార్యాదర్శి ఈ.ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధేశ్వర మిశ్రొ, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, పట్టణ అధ్యక్షుడు పి.వసంత్‌కుమార్, దారపు చిట్టి, కాశీనగర్ అధ్యక్షుడు చలపతిరావు, కోడూరు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వివిధ జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

రేషన్ డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

- రెండు 6ఎ కేసుల నమోదు



కోఆపరేటివ్ స్టోర్‌లో ఉన్న రేషన్‌డిపోలో సోదా చేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: పట్టణంలో ఉన్న చౌకధరల దుకాణాల్లో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కో ఆపరేటివ్ స్టోర్స్‌లో నిర్వహిస్తున్న రేషన్ డిపోలు, నంబర్ 133, 128లలో సోదాలు నిర్వహించగా 133వ నంబర్ డిపోలో 601కిలోల బియ్యం, 24.5కిలోల పంచదార, 128వ నంబర్ డిపోలో 6472కిలోల బియ్యం , మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన కందిపప్పు 2కిలోలు, పంచదార 25కిలోలు తక్కువ ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. దీంతో డీలర్లు సనివాడ అప్పారావు, సనివాడ గోవిందలపై 6ఎ కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయా డిపోల నిర్వహణను డిపో నంబర్ 208 డీలర్ కె.రాణికి అప్పగించారు. సోదాల్లో సీఎస్‌డీటీ ఎస్‌వీవీఎస్ మూర్తి, వీఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ఏరియాలో సర్వే పరిశీలన

సాలూరు: మండలంలోని తోణాం బీట్ పరిధిలో పూతికవలస మైనింగ్ ఏరియాలో శుక్రవారం ప్రారంభించిన సర్వేను విజయనగరం, పార్వతీపురం డీఎఫ్‌ఓలు వెంకటేష్, ప్రసూనలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ ప్రాంతం అటవీశాఖ పరిధిలో నిదని ఆ శాఖ అధికారులు, అటవీశాఖపరిధిలో నిది కాదని మైనింగ్ లీజుకు తీసుకున్న యజమానుల మధ్య గతంలో న్యాయస్థానంలో వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని సర్వే చేయాలని సర్వే ఆఫ్ఇండియా ఆదేశించినట్లు సాలూరు ఫారెస్ట్‌రేంజ్ అధికారి రామారావు తెలిపారు. ఈ నెల 11 వరకు ఈ సర్వే ఉంటుందని అన్నారు.



సర్వేపై సూచనలు ఇస్తున్న డీఎఫ్‌ఓలు

బాలసదన్ విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారం వల్ల వాంతులు
- ఆస్పత్రికి తరలింపు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బాలసదన్‌లో ఉంటున్న పిల్లలు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు.శుక్రవారం రాత్రి పిల్లలకు బాలసదన్‌లో గుడ్డు ఉక్కురు పెట్టారు. అది తిన్న వెంటనే విద్యార్థులంతా ట్యాప్ దగ్గరికి వెళ్లి వాంతులు చేసుకుని ఇబ్బంది పడ్డారు. బాలసదన్‌లో ఉన్న 12 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్న విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. శాంతకుమారి బాలసదన్‌కు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు ఏం పెట్టారు? ఎందువల్ల వాంతులయ్యాయని సిబ్బందిని ఆరా తీశారు.

పరామర్శించిన అప్పారావు

బాలసదన్ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలియగానే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసలి అప్పారావు బాలసదన్‌కు చేరుకుని పిల్లలను పరామర్శించారు. సంఘటన గురించి సిబ్బందిని ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. శాంతకుమారిని ఆదేశించారు. అనంతరం పిల్లలను జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స కోసం తరలించారు.



వాంతులు చేసుకుంటున్న పిల్లలు

ఘనంగా గంధమహోత్సవం

- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రావణి



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం టౌన్: వేలాది మంది భక్తులతో బాబామెట్ట పునీతమైంది. హజరత్ ఖాదర్‌వలీ బాబా పుణ్యక్షేత్రాన్ని దర్శించేందుకు బారులు తీరుతున్నారు. శుక్రవారం దర్బార్‌లో నిర్వహించిన గంధ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దర్గాలో పవిత్ర ఖురాన్ పఠనంతో ఉత్సవం ప్రారంభమైంది. దర్బార్ వారసులు సజ్జాద్ నషీన్ మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరీ బాబా దర్గా, దర్బార్ ముతావలి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎం.డి జాఫర్ షరీఫ్ ఉర్సు మహోత్సవాన్ని ప్రారంభిస్తూ, దర్బార్‌లో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. అనంతరం ఫకీర్ మేళాతో ఊరేగింపుగా, మేళతాళాల నడుమ బాబా వారి చాదర్, అత్తరు, పూలమాలలతో దర్గాకు కోలాహలం మధ్య వచ్చి దర్బార్‌లోని ఆనాటి బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై నిలిపారు. భక్తుల కోలాహలం మధ్యన బాబాకు చాదర్ సమర్పించి, జెండా మహోత్సం నిర్వహించారు. పురవీధుల్లో రథంపై ఆశీనులైన బాబా భక్తులను ఆశీర్వదించారు. కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు, బ్యాండ్ పార్టీలతో నగరవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. సుమారు 60వేల మంది భక్తులు లంగర్ ఖానాలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మతసామరస్యానికి ప్రతీక

మతసామరస్యానికి ప్రతీక మన విజయనగరమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బాబామెట్టలోని రెడ్డిబాబా ఆధ్వర్యంలో సర్వేయర్ కుమార్ నివాసం నుంచి చందన్ ఊరేగింపును ఆమె ప్రారంభించారు. బాబా చిత్రపటానికి పూలమాలలేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వ మానవాళికి అద్భుతమైన సందేశాన్ని హజరత్ ఖాదర్ వలీ బాబా అందించారన్నారు.



బాబా చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌ఓ వెంకటరావు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలో రూ.10 లక్షలకు మించి నగదు లావాదేవీలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా డివిజనల్ రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఇన్‌కం ట్యాక్స్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు రూ.10 లక్షలకు మించి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపిన వారి వివరాలను బ్యాంక్ అధికారుల నుంచి బాబితా సేకరించి విచారణ జరపాలని కోరారు. అలాగే తక్కువ నగదు రూపంలో ఎక్కువ సార్లు లావాదేవీలు నిర్వహించే వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ అధికారులు కె.రవిశంకర్, జి.రమణ, పరిపాలన అధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో శుక్రవారం ఉదయం ఫల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో వెండి సింహవాహనంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణాన్ని స్మార్త ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. ఈ సేవ కోసం రూ.500 చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఆడపిల్ల రక్షణ అందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

అరసవల్లి: 'ఆడపిల్లలను రక్షించు...ఆడపిల్లలను చదివించు..' అనే నినాదం మారుమోగింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అధికార బృందాలు ర్యాలీగా తరలివెళ్లాయి. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ ర్యాలీలో భాగంగా ఆడపిల్లల భవిష్యత్ కోసం నినాదాలు చేశారు. అనంతరం స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారులు సందర్శించారు. కార్యక్రమంలో డీఐఓ ఆర్‌వీఎస్ కుమార్, వైద్యాధికారులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



ఎలుగును వెంబడిస్తున్న వీధి కుక్కలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం డోకులపాడు పరిసర జీడి తోటల్లో శుక్రవారం ఎలుగు సంచరించింది. అయితే పరిసర తోటల్లో సంచరిస్తున్న వీధి కుక్కలు ఎలుగును వెంబడించడంతో ఎలుగు పరుగులు తీసింది. జీడి పంట ప్రస్తుతం పూత దశలో ఉండటంతో రైతులు జీడి తోటలకు పనుల కోసం వెళ్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎలుగులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వందన వికాస కేంద్రాల ద్వారా ఆదాయం

మెళియాపుట్టి: గిరిజనులు వందన వికాస కేంద్రాల (వీడీవీకే)ద్వారా ఆదాయం పెంపొందించుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ బండి నవ్య అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీడీవీకే ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. జీడి పిక్కలు, చింతపండు, పసుపు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. లీడర్లు, సభ్యులు సక్రమంగా పనితీరు కనబరచాలని అన్నారు. వందన వికాస కేంద్రాల సభ్యుల నుంచి వెయ్యిరూపాయల వాటాధనం కట్టించాలని తెలిపారు. కేంద్రాల్లో ఉన్న సభ్యుల తోటల్లోని జీడి ఇతరత్రా పంటలు వందన వికాస కేంద్రాలకు అమ్మేలా వారికి అవగాహన కల్పించాలని ఏపీఎం లలితతో అన్నారు. కేంద్రాల సభ్యులందరికీ శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం చాపర గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు దస్త్రాలను పరిశీలించారు.

తాగునీటి కోసం మానిటరింగ్ సెల్

హిరమండలం: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. హిరమండలం వంశధార రిజర్వాయర్‌కు అనుసంధానం జరుగుతున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పంపు హౌస్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రూ.750 కోట్లతో చేపడుతున్న ఈ పనులు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఉద్దానం వరకు పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వేసవిలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే 9100120604 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

గడ్డికుప్పలు దగ్ధం

టెక్కలి రూరల్: స్థానిక మండపోలం కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో అదే వీధిలోని కోనారి రామారావుకు చెందిన సుమారు ఐదు ఎకరాల గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్టేషన్ ఫైర్ అధికారి మల్లేశ్వరరావు, సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపుచేశారు. విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగలడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

తినరో భాగ్యము



మునక కట్టలు

- ఉద్దానంలో విరగ్గాసిన మునగ పంట
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు ప్రారంభం
- ఉద్దాన దేశీ మునగకు భలే డిమాండ్



ఉత్తరాది ఎగుమతులకు సిద్ధమైన మునగమూటలు

కాశీబుగ్గ: ఉద్దానం మునగ ఉత్తరాదికి వెళ్తోంది. రుచిలో ఈ మునగకు సాటే లేదు. ఈ దేశీ మునగకు స్థానికంగా కూడా చాలా మంది అభిమానులు ఉన్నారు. ఈ రుచే ఉత్తరాది వారిని కూడా ఆకట్టుకుంది. జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఉన్న ఏడు మండలాల్లోని ఉద్దానంలో పండే మునగ రుచే వేరు. మెట్ట, పల్లపు ప్రాంతాల్లో మునగ చెట్లు ఉన్నా రుచి, కమ్మదనంలో ఉద్దాన మునగదే ప్రథమ స్థానం. అందుకే ఈ మునగను ఉత్తరాది రాష్ట్రాల వారు మెచ్చుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ట్రిప్పుకు రెండు టన్నుల మునగ కాయలు ఎగుమతి అవుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న కాశీబుగ్గ పాతజాతీయ రహదారి, ఇచ్ఛాపురం, హరిపురంలో ఎగుమతులు జరిగే పాయింట్‌లు ఉన్నాయి. ఉద్దాన ప్రాంతంలో ఉన్న వజ్రపుకొత్తూరు, మందస, పలాస, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో 20వేల హెక్టార్లలో ఉన్న జీడిమామిడి, కొబ్బరి, కాయగూరల తోటలలో అంతరపంటగా పండిస్తున్నారు. లోకల్ మార్కెట్ చూస్తే పూండి, వజ్రపుకొత్తూరు, కొర్రాయిగేటు, హరిపురం, మందస, బారువ, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, బ్రాహ్మణతర్లా జాతీయ రహదారుల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

కిలో రూ.50

మునగ ఏడాదికి మూడు సార్లు దిగుబడి ఇస్తుంది. కొన్ని మునగ చెట్లు మాత్రం ఒక్కసారి మాత్రమే కాస్తున్నాయి. హైబ్రీడ్ కాయలు ఎప్పుడు కావాలన్నా కాస్తున్నప్పటికీ రుచి అంతగా ఉండకపోవడంతో అధిక శాతం మంది దేశీ మునగనే కోరుకుంటున్నారు. కాయలు తుంచిన నాలుగు ఐదు రోజుల వరకు వాటిని వినియోగించవచ్చును. సరిపడా శీతలం అందిస్తే వారం రోజులు వరకు నిల్వ ఉంటాయి. వీటి సేకరణ ఒక్కపూటలో జరుగగా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు రెండు రోజులు పడుతుంది. పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన మునగ కాయలు లారీ లోడు నిండగానే అవి బయలుదేరుతాయి.



సీజన్ ప్రారంభంలో కిలో రూ.100 పలికిన మునగకాయలు ప్రస్తుతం కేజీ రూ.50 రూపాయలు పలుకుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో మునగ కాయలను కూరలకు, పచ్చడికి, మునగ ఆకులను పులుసు, సాంబారు, వేపుడుకు వాడుతారు. ఉత్తరాది పచ్చళ్లలో మునగ కాయల పచ్చడి ప్రత్యేకమైన వంటకం. ఇది ఏడాది పాటు నిల్వ ఉంచుకుని భోజనాలలో తింటారు.

సంతోషకరం



ఉద్దానంలో పండించే పంటలు రుచికి పెట్టింది పేరు. పెరటి పంటగా పండించుకునే మునగ పంట ప్రస్తుతం వాణిజ్య పంటగా మారుతుండటం సంతోషంగా ఉంది. మేము తోటలలో సేకరించిన మునగ పంటను పరిసర ప్రాంతాల్లో అమ్మేస్తాం. అధికంగా దిగుబడి వచ్చినా ఒకే సారి కాయలు అందరూ ఒకే సారి కోసినా ఎగుమతులు చేసుకోవడం కోసం పలాస తరలిస్తాం. పంట దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ రేటు పలుకుతుంది. పంట అధికంగా పండితే వాటి రేటు తగ్గిపోతుంది.

– గుజ్జు లక్ష్మి, మహిళా రైతు, బొడ్డపాడు, పలాస మండలం

ఉద్దాన వాతావరణంలో..



ఉద్దాన వాతావరణం మునగ పంట దిగుబడికి మేలు చేస్తుంది. హైబ్రీడ్‌తో పోల్చితే ఈ దేశీ మునగ చాలా బెటర్. ప్రమాదాలు జరిగినా, ఎలాంటి ఆపరేషన్‌లు జరిగినా మునగ ఆకును వేపుకుని తింటారు. వారానికి రెండు సార్లు ఉద్దాన వాసులు మునగ ఆకులు, మునగ కాయలు తినడం పరిపాటి. ఉద్దాన ప్రాంతంలో ఉన్న మునగ కాయలకు ఇంత డిమాండ్ రావడం ఉద్దాన రైతుగా సంతోషం వ్యక్తం చేస్తున్నాం. నేను ఆర్మీలో రిటైరయ్యాను. మాకున్న తోటలో మునగ చెట్లు పెంచుతున్నాము. ఏడాదికి మూడు సార్లు కాపు కాస్తున్నాయి.

– కుత్తుం వినోద్‌కుమార్, విశ్రాంత ఆర్మీ అధికారి, మునగ రైతు, మాకన్నపల్లి గ్రామం, పలాస మండలం

సాగు విస్తీర్ణం :	పంట ప్రారంభంలో ధర :	ఎగుమతి ఎక్కడికి :	వినియోగం:	ప్రత్యేకతలు :
20,000 ఎకరాలు (ఉద్దానంలో)	కిలో 100	పశ్చిమబెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా	పచ్చడి, పులుసు, వేపుడు, సాంబారు తయారీకి..	మునగ పచ్చడి ఏడాది పాటు నిల్వ ఉంటుంది

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



మన్మథరావు (ఫైల్)



పుణ్యవతి(ఫైల్)



జలుమూరు: ఎర్రమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం ఆలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. శ్రీముఖలింగం గ్రామానికి చెందిన పంచాది ఎర్రమ్మ(56) తోటివారితో కలిసి ఉన్నత పాఠశాల వైపు పొలం పనులకు బయలుదేరింది. అదే సమయంలో చల్లవానిపేట నుంచి హిరమండలం వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి ఎర్రమ్మను ఢీకొట్టింది. తలకు బలంగా దెబ్బతగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సైకిల్‌పై వెళ్తున్న ప్రసాద్‌ను కూడా వ్యాన్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ప్రసాద్‌ను బుడితి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. బొలెరో వాహనం గ్రామం శివారున బోల్తాపడింది. డ్రైవరు, క్లీనర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. మృతురాలు ఎర్రమ్మకు కుమారుడు శేఖర్, కుమార్తె రోజా ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీలు ఢీకొని..

బూర్జ : మండలంలోని పెద్దపేట కూడలి వద్ద రెండు స్కూటీలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పెద్దపేటకు చెందిన కడగల మన్మథరావు (43) ఉదయాన్నే స్కూటీపై వెళ్తుండగా శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వెళ్లేందుకు ఇద్దరు వ్యక్తులు మరో స్కూటీపై అతి వేగంగా వచ్చి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడిపోయారు. మన్మథరావు తలకు బలమైన గాయాలయ్యాయి. ముగ్గురినీ 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మన్మథరావు మృతి చెందారు. మిగిలిన ఇద్దరూ గాయాలతో బయటపడ్డారు. మన్మథరావుకు భార్య ఇందుమతి, ఇద్దరు కుమార్తెల్లు దీక్షిత, లహరి ఉన్నారు. ఇందుమతి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

టెక్కలి రూరల్: టెక్కలి మండలం రావివలసకు చెందిన నార్ల పుణ్యవతి(49) గురువారం రాత్రి మృతి చెందింది. ఈమె గత నెల 19న గ్రామస్తులతో కలిసి తిరుమల శ్రీవారి సేవకు వెళ్లారు. ఈ నెల 1న తిరుపతిలో బయలుదేరి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో తీవ్రఅస్వస్థతకు గురైంది. ఇక్కడికి తీసుకొచ్చాక శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పుణ్యవతి భర్త కామేశ్వరరావు కొన్నేళ్ల కిందట మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి శుక్రవారం రావివలసలో అంత్యక్రియలు నిర్వహించారు.

పాఠశాలను మూసివేస్తే క్రిమినల్ చర్యలు

ఆమదాలవలస రూరల్: విద్యార్థుల చదువుతో చెలగాటమాడుతూ విద్యా సంవత్సరం చివరిలో ప్రైవేట్ స్కూల్‌ను మూసివేస్తే యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం హెచ్చరించారు. ఆమదాలవలస మండలం అక్కివరం పంచాయతీ కొత్తరోడ్ జంక్షన్‌లో వెలాసిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ నిర్వహణపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. తరగతుల నిర్వహణ జరగకపోవడంతో విద్యాశాఖాధికారులు, సచివాలయం మహిళా సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. మూడు నెలలుగా ఫిర్యాదులు వస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండటంతో అర్ధాంతరంగా స్కూల్ మూసివేస్తే కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషన్ సభ్యులు తెలిపారు. విద్యా సంవత్సరం ముగిసే వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీఈఓకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. విద్యాశాఖాధికారులు, సచివాలయ సిబ్బంది నిత్యం సందర్శిస్తూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు, తోటాడ సర్పంచ్ మెట్ట శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, బాలల సంఘాల నాయకులు కె.శ్రీనివాస్, మొదలవలస వాసుదేవకుమార్, బి.రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకుసాగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని విశాఖపట్నంకు చెందిన ఆంధ్రా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ రామయ్య అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో సబ్జెక్టు కంటే సాంకేతిక పరిజ్ఞానం కీలకమని చెప్పారు. ప్రతి విద్యార్థి నిరంతరం సాంకేతిక అంశాలు తెలుసుకోవాలని, పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు గమనించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్లేషణాత్మక విద్య అందించాలి

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్
- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు నైతిక విలువలు, విశ్లేషణాత్మక ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్(కళాశాల విద్య) కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్), న్యూఢిల్లీ సహకారంతో జాతీయ విద్యా విధానం(నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)-2020 పేరిట జరుగుతున్న రెండురోజుల జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును, విద్యా ప్రమాణాలను విశ్లేషించేలా పరీక్షల నిర్వహణ ఉండాలన్నారు. టీచింగ్, లెర్నింగ్ విధానంలో మరిన్ని మార్పులు, సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇంటర్న్‌షిప్' విధానంతో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.


అందరి సహకారం అవసరం..

బీఆర్ఏయూ పూర్వపు వీసీ, గిరిజన యూనివర్సిటీ విజయనగరం స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమలుకు కాలేజీల్లో లెక్చరర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎన్ఈపీ నేషనల్ సెమినార్ డైరెక్టర్ అండ్ కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మాట్లాడుతూ సదస్సు విజయవంతానికి సహకరించిన కళాశాల లెక్చరర్లు, సిబ్బందిని అభినందించారు. సదస్సు జరిగిన తీరు, ఏర్పాట్లను కో కన్వీనర్ కె.మౌనిక వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, రుద్రమరాణి, జ్యోతిలక్ష్మి, నీరజ, కె.సూర్యచంద్ర, ఎన్ఎస్ఎన్ స్వామి, సత్యనారాయణ, పి.శివప్రసాద్, ఆర్.ప్రమీల, చక్రవర్తి, డి.పైడితల్లి, పి.శాంతకుమారి, ఎం.ప్రదీప్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు. అంతకుముందు విట్, చెన్నైకు చెందిన కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ బీవీఎఎస్ఎస్ ప్రభాకరరావు ఐటీసీ టూల్స్ ఫర్ సుస్టెనైబుల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన కాంప్లెక్స్ ఎడ్యు ప్రైవేట్ లిమిటెడ్ కొండాపూర్ కో ఫౌండర్/సీటీవో వై.శ్రీకాంత్ 'హౌ టెక్నాలజీ యాక్ట్స్ యాజ్ ఏ లెవరేజ్ ఇన్ ఇంప్లిమెంటింగ్ ఎన్ఈపీ 2020' అనే అంశంపై ప్రసంగిస్తూ టెక్నాలజీ ఉపయోగించుకునే విధానాన్ని వివరించారు.



డాక్టర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు, పూర్వపు వీసీ లజపతిరాయ్

మంచు ముత్యాల ఇల్లు.. సాలీడుకే చెల్లు



మంచు ముత్యాలు పొదిగిన సాలె గూడు ఇది. కష్టపడి ఇంటిని కట్టుకున్న స్పైడీ.. నా కంటే గొప్పవాడేడీ అన్నట్టు ఫొటోకిలా ఫోజిచ్చింది. శ్రీకాకుళం పరిసర ప్రాంతంలో ఓ వేకువన ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

'నేర నియంత్రణలో మహిళా పోలీసులే కీలకం'



మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలపై జరిగే నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆమె మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను మానవీయ కోణంలో అర్థం చేసుకుని పరిష్కరించాలని, గ్రామాల్లో సందర్శించి తరచూ గొడవలు పడే వారిని గుర్తించి వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలలు, ముఖ్యమైన కూడళ్లు, బస్సులు, ఆటోల్లో మహిళలు, విద్యార్థినులను ప్రేమ పేరిట వేధించే ఆకతాయిల సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

దిశ యాప్ గ్రామ, పట్టణాల్లో ఉన్న మహిళలకు తెలియపరిచి క్షేత్రస్థాయిలో సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాల వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించాలన్నారు. ఎన్నికల నియమావళి అందరూ పాటించేలా చూడాలన్నారు. వీసీలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ జి.శ్రీనివాసరావు, ఆయా పోలీస్ కార్యాలయాలు, స్టేషన్ల నుంచి సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ జి.గ్రేసీ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 23న పరీక్ష ఉంటుందని తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. రిజర్వేషన్ ప్రాప్తికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి: డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

రణస్థలం: పదో తరగతి విద్యార్థులు చక్కగా చదువుకుని పదికి పది పాయింట్లు సాధించాలని డీఈఓ జి.పగడాలమ్మ సూచించారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, ఎంఈఓ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.త్రినాథరావు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, హెచ్ఎంలు జగన్నాథరావు, రాజాకిషోర్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో 80 చెరువుల అభివృద్ధి



చిట్టివలసలోని జగ్గన్న కోనేరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆమదాలవలస: అమృత్ సరోవర్ కింద నిర్వహిస్తున్న చెరువుల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఆమదాలవలస మండలంలోని చిట్టివలస గ్రామంలో గల జగ్గన్న కోనేరులో చేస్తున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడి వేతనాల వివరాలు, పని దినాలు, సదుపాయాల గురించి ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆజాదీ కాఅమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో 80 చెరువులను సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేశారని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 20 చెరువుల పనులు పూర్తయ్యాయని, మిగతా 60 చెరువుల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే ఈ పనుల్లో జాబ్‌కార్డు ఉన్నవారంతా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఆగస్టు నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసి చెరువులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెరువుల్లో, ఊరి బయట చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వన్య ప్రాణులను రక్షించుకుందాం



మానవ మనుగడకు ఆధారమైన అడవులు, వన్య ప్రాణులను సంరక్షించుకోవడం మనందరి కర్తవ్యమని ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, కె.సుహాస్‌చంద్‌లు అన్నారు. వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొళిగాం ఉన్నత పాఠశాల, ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముచ్చింద్ర పాఠశాల విద్యార్థులు వన్యజీవుల మాస్క్‌లతో పాఠశాల తోటల్లో ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది.

– ఇచ్ఛాపురం రూరల్